శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## కామాక్షితాయి సేవలో విద్యాశాఖ ఆర్‌జెడి



**బుచ్చి జనవరి 24 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయిని ఎడ్యుకేషనల్ డిపార్టమెంట్ జాయింట్ డైరక్టర్ సుబ్బారావు (గుంటూరు ) ,సునంద ,వారి కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు, కార్యనిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు వారిని స్వాగతించారు.వారి గోత్రనామాలతో పూజలు చేయించారు. అనంతరం వారికి శేష వస్త్రాలు అందజేశారు.ఈకార్యక్రమంలో ఎంఇఒ దిలీప్‌కుమార్ పలువురు విద్యాశాఖాధికారులున్నారు.

## 3వ విడత జగనన్న చేదోడు పథకం దరఖాస్తుకు ఈ నెల 26న గడువు



**నెల్లూరుటౌన్, జనవరి 24, ప్రభాతవార్త:** జగనన్న చేదోడు పథకం కోసం అర్హులైన లబ్దిదారులు ఈ నెల 26వ తేదీ లోగా గ్రామాల వార్డు సచివాలయం వలంటీరును ప్రదించి సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని, వెనుకబడిన తరగతుల కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ వి.బ్రహ్మానందరెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్రమైన నెల్లూరులోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్రవ్యాప్తంగా జగనన్న చేదోడు పథకం (రజకులు, నాయిబ్రాహ్మణులు మరియు టైలర్స్) పథకం కింద అర్హులైన ఒక్కొక్కరికి రూ.10వేల ఆర్థిక సాయం పంపిణీ కార్యక్రమం 2020-21 సంవత్సరం నుంచి ప్రారంభించబడిందని పేర్కొన్నారు. మొదటి విడతగా 2020-21 ఆర్థిక సంవత్సరం మన జిల్లాలో మొదటి విడత 16563 మంది లబ్దిదారులకు రూ. 16.56 కోట్లు నేరుగా వారి బ్యాంకు ఖాతాకు విడుదల చేయడమైనది. రెండో విడతగా 2021-22 ఆర్థిక సంవత్సరం మన జిల్లాలో 'రెండో విడత 16014 మంది లబ్దిదారులకు రూ. 16.01 కోట్లు నేరుగా బ్యాంకు ఖాతాకు రెండో విడతగా విడుదల చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్రవ్యాప్తంగా జగనన్న చేదోడు పథకం కింద 2022-23 ఆర్థిక సంవత్సరానికి మూడో విడత కింద ఆర్థిక సహాయం విడుదల చేసేందుకు దరఖాస్తులు కోరుతున్నామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారందరూ ఈ నెల 26వ తేదీ లోగా మీ గ్రామ లేదా వార్డు వలంటీరును సంప్రదించి సంబంధిత సచివాలయం నందు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమం మండల అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్ల పర్యవేక్షణలో జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

## నాగారపమ్మ ఆలయంలో చోరీ



**చేజర్ల,జనవరి24ప్రభాతవార్త:** చేజర్ల మండలం పెరుమాళ్ళపాడులోని నాగారపమ్మ ఆలయంలో చోరీ జరిగినట్లు మంగళవారం గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఆలయంలో రాత్రి గుడితాళాలు వేసి ఇంటికి వెళ్ళిన పూజారి ఉదయం గుడితెరచి పూజచేసేందుకు వచ్చేలోగా తాళాలు పగులగొట్టి అమ్మవారి మెడలోని 14కాసుల పేరు, తాళిబొట్టు, హుండీ దొంగిలించినట్లు గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందించారు. వీటి విలువ సుమారు 2లక్షల రూపాయల వరకు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. గుడినిర్మించి 23సంవత్సరాలైనా ఇప్పటివరకు ఇలాంటి సంఘటనలు ఎన్నడూ జరగలేదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఎస్ఐ మరిడి నాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## కోన ఇఓ వెంకటసుబ్బయ్య రాజకీయ బదిలీ

**పెంచలకోన(రాపూరు), జనవరి 24 ప్రభాతవార్త** పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం సహాయక కమీషనర్ జోల్లు వెంకటసుబ్బయ్యను బదిలీ చేస్తూ మంగళవారం రాత్రి ఉత్తర్వులు అందినట్లు తెలుస్తుంది. వెంకటసుబ్బయ్య వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డికి సన్నిహితంగా వున్నారన్న ఉహాగానాలతో ప్రస్తుత వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త, తిరుపతి జిల్లా వైసిపి పార్టీ ఆధ్యక్షుడు,రాష్ట కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్ నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ఇఓను బదిలీ చెయించినట్లు తెలుస్తుంది. నూతన ఇఓగా జనార్ధన్ రెడ్డిని నియమించినట్లు దేవస్థానం సిబ్బంది తెలిపారు. ఎది ఎమైనా వెంకటగిరి నియోజకవర్గంలోని రాపూరులో మరింత మంది అధికారుల బదిలీలలు తప్పవని నేదురుమలల్లి వర్గం నాయకులు చెపుతున్నారు.

# రహదారి భద్రత అనేది నిరంతర ప్రక్రియ



**నెల్లూరు అర్బన్, జనవరి 24, ప్రభాతవార్త:** రహదారి భద్రత అనేది నిరంతర ప్రక్రియ అని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాల పట్ల పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ప్రమాదాలను నివారించేందుకు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం నెల్లూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ స్రవంతి, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, రోడ్డుపై అవసరమైన చోట ఫ్లైఓవర్ బ్రిడ్జిలను నిర్మిస్తోందని, మానవ తప్పిదాల వలన ప్రమాదాలు జరిగిన వెంటనే ప్రాణనష్టం జరగకుండా 108, 104 సేవలు అందుబాటులో ఉంచిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ కూడా బాధ్యతగా రోడ్డు భద్రతా నియమాలను తుచ తప్పకుండా పాటిస్తూ, తమను తాము మార్చుకోవాలని, అప్పుడే మార్పు కనిపిస్తుందన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో అధికారులు గుర్తించిన సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా ఆర్టీసీ డ్రైవర్లకు, సిబ్బందికి విశ్రాంతి తీసుకునేందుకు వసతి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. రోడ్డు భద్రత పట్ల ప్రతి ఒక్కరిలో స్వచ్ఛంధంగా మార్పు రావాలని మంత్రి ఈ సందర్భంగా ఆకాంక్షించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ ప్రతి నిత్యం వాహనాల్లో ప్రయాణించే వారు నియమాలను పాటిస్తూ ప్రమాదాల నివారణకు తమ వంతు బాధ్యతగా గుర్తించాలన్నారు. తొలుత రోడ్డు భద్రతా వారోత్సవాల్లో చేపట్టిన కార్యక్రమాలను, జిల్లాలో రోడ్డు ప్రమాదాల వివరాలను, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలను ఉప రవాణా కమిషనర్ చందన్ క్లుప్తంగా వివరించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు మంత్రి చేతుల మీదుగా మొమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఉపరవాణా కమిషనర్ చందర్, నేషనల్ హైవేస్ పీడీ గోవర్ధన్, జెడ్పీ సీఈవో చిరంజీవవి, డీఎంహెచ్‌వో పెంచలయ్య, రోటరీక్లబ్ గవర్నర్ సతీష్, లారీ అసోసియేషన్ అధ్యక్షులు గోపాల్‌నాయుడు, బంగే ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి దక్షిణామూర్తి, రవాణా శాఖ ఇన్స్‌పెక్టర్లు, పలువురు జిల్లా స్థాయి అధికారులు, డ్రైవర్లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# రెవెన్యూ వసూళ్ల లక్ష్యాలను పూర్తి చేయండి



**నెల్లూరు కార్పొరేషన్, జనవరి 24, ప్రభాతవార్త:** నగరపాలక సంస్థ పరిధిలోని ఆస్తి, కొళాయి, డ్రైనేజీ, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లకై రెవెన్యూ శాఖకు నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని కమిషనర్ హరిత రెవెన్యూ అధికారులకు సూచించారు. నగరపాలక సంస్థ రెవెన్యూ శాఖ అధికారులతో కమిషనర్ కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రెవెన్యూ అధికారులు పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని, ఇప్పటికీ డిమాండ్ నోటీసులు జారీ చేయని కమర్షియల్ భవనాలను గుర్తించి వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. పన్ను నోటీసులను ఖాతరు చేయని మొండి బకాయిదారులను గుర్తించి వారికి సంబంధించిన ఆస్తులను జప్తు చేయాలని, కొళాయి, డ్రైను కనెక్షన్లు తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. నగరపాలక సంస్థ అద్దె షాపుల బకాయిలను పూర్తిగా వసూలు చేయాలని, బాకీ చెల్లించని వారిని షాపుల నుంచి వెంటనే ఖాళీ చేయించాలని సూచించారు. షాపుల అద్దెను క్రమం తప్పకుండా ప్రతి నెలా వసూలు చేయాలని అధికారులకు సూచించారు. నగరపాలక సంస్థ అద్దె షాపుల కేటాయింపులను అప్‌డేట్ చేసి వివరాలను ఎప్పటికప్పుడు పారదర్శకంగా ఉంచాలని, ఖాళీగా ఉన్న షాపులను వెంటనే అద్దెకు ఇవ్వాలని తెలిపారు. నగరవ్యాప్తంగా ప్రతి భవనాన్ని పన్ను పరిధిలోకి తీసుకొచ్చి డిమాండ్ నోటీసులు జారీ చేయాలని కమిషనర్ ఆదేశించారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న పారిశుధ్య నిర్వహణ పనుల యూజర్ చార్జీల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ సూచించారు. పన్ను వసూళ్లలో సచివాలయ అడ్మిన్ కార్యదర్శులకు లక్ష్యాలను నిర్దేశించి కార్పొరేషన్ ఆదాయం పెంచేందుకు అధికారులంతా కృషి చేయాలని కమిషనర్ సూచించారు. సమీక్షా సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## రాపూరు ఎస్టీ గురుకులం నుంచి పారిపోయిన విద్యార్థినులు

### ఎస్పీ చొరవతో 24 గంటల్లోపు పట్టుకున్న పోలీసులు



**రాపూరు , జనవరి 24 ప్రభాతవార్త:** జిల్లాలోని రాపూరు ఎస్టీ గురుకులంలో 10 వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు సోమవారం రాత్రి గురుకులం నుంచి పారిపోయారు. రాత్రి 8 గంటల సమయంలో విద్యార్థినులు తప్పిపోయిన విషయాన్ని కనుగొన్న గురుకులం సిబ్బంది, హుటాహుటిన తప్పిపోయిన యాకసిరి అంకిత, మల్లికా జ్యోతి, బండి నాగమణి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే పారిపోయిన విద్యార్థినుల్లో ఒకరు వారి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తాము వెంకటగిరిలో వున్నట్లు చెప్పినట్లు సమాచారం. దీంతో విద్యార్థినుల తల్లిదండ్రులు గురుకులం వద్దకు చేరుకొనిఆందోళన నిర్వహించారు. గురుకులం నుండి ముగ్గురు విద్యార్థినీలు పారిపోతుంటే ఇక్కడ సిబ్బంది ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఆడపిల్లలకు సరైన భద్రత కల్పించక పోవడం ఎమిటనీ ప్రశ్నించారు. గత ఏడాది కూడా ఇదే గురుకులం నుండి ఇద్దరు విద్యార్థినులు పారిపోయారు. అయితే విద్యార్థినులు వెళ్లిపోయారన్న సిబ్బంది ఫిర్యాదుతో ఎస్పీ విజయా రావు వెంటనే స్పందించి దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశించారు. దీంతో ఆత్మకూరు డిఎస్పీ కోటారెడ్డి, పర్యవేక్షణలో రాపూరు సిఐ కోటేశ్వర రావు, ఎస్ఐ కాంతి కుమార్‌లు వెంకటగిరికి చేరుకుని విచారణ నిర్వహించారు. ఈ క్రమంలో ఆర్‌టీసి బస్టాండ్‌లోని సిసి కెమెరాల్లో విద్యార్థినులు రాత్రి 9.17 సమయంలో బస్టాండ్ అవరణలో వున్నట్లు గుర్తించారు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు పట్టణంలోని టీచర్స్ కాలనీలో విద్యార్థినులు ఉన్నట్లు గుర్తించి వారిని తీసుకుని రాపూరుకు వచ్చారు. కేసు నమోదు చేసిన 24 గంటల్లోపు కేసును ఛేదించిన రాపూరు సిఐ కోటేశ్వర రావును, ఎస్ఐ కాంతి కుమార్‌ను పలువురు అభినందించారు. దీంతో పాటు పోలీసులు సకాలంలో స్పందించేలా చర్యలు తీసుకోన్న జిల్లా ఎస్పీ విజయారావుకు విద్యార్థినీల తల్లితండ్రులు ధన్యవాదాలు తెలిపారు.

## వకృత్వ పోటీలలో కలువాయి విద్యార్దినికి జిల్లా స్దాయి గుర్తింపు

**కలువాయి జనవరి 24 ప్రభాతవార్త** అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా కలువాయికి చెందిన బి.వి.ఎన్.ఆర్ జడ్‌పి ఉన్నత పాఠశాల ప్లస్‌కి చెందిన విద్యార్దిని ఎస్ లక్ష్మీసాహితి జిల్లా స్దాయిలో వకృత్వ పోటీలలో జిల్లా స్దాయిలో ద్వితీయ స్దానం సాధించినందుకు మంగళవారం జిల్లా అధికారుల చేతుల మీదుగా 5 వేల రూపాయాలు నగదు సర్టిఫికేట్ అందజేశారు.ఈ సందర్బంగా విద్యార్దినికి ఎంఇఒ ఎం బాలకృష్ణారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సడ్డా జనార్దన్‌రెడ్డి, ఎస్ఎంసి కమీటి సభ్యులు ఉపాధ్యాయని,ఉపాధ్యాయులు సిఆర్‌పిలు అభినందనలు తెలిపారు.

## కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబుకు రాష్ట్ర స్థాయి బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీషన్ అవార్డు



**నెల్లూరు అర్బన్, జనవరి 24, ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబుకు రాష్ట్ర స్థాయి అభినందలు దక్కాయి. భారత ఎన్నికల సంఘం వారు రాష్ట్ర స్థాయి బెస్ట్ ఎలక్ట్రోరల్ ప్రాక్టీషన్ అవార్డు 2022 గాను పురస్కారానికి ఎంపిక కావడం జరిగింది. కలెక్టర్ సిఫారసు మేరకు ఈ పుష్కరాన్ని లైసెలింగ్ అధికారులుగా అప్పగి సంయుక్త కలెక్టర్, హరేంద్రప్రసాద్, విజయరావు, ఐపీఎస్, నెల్లూరు జిల్లా నుంచి ఎంపిక కాబడ్డారు. ఈ పురస్కారం, ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల సందర్భంగా నియంత్రణ, సాంకేతిక భద్రతకు, పోలింగ్ స్టేషన్ వద్ద సౌకర్యాలు మెరుగుపరిచి పోలింగ్ కేంద్రాల వద్ద వికలాంగులకు, వృద్ధులకు వీల్‌చైర్స్ సదుపాయాలు, ఔత్సాహిక, ఈవీఎంల నిర్వహణ, పోస్టల్ బ్యాలెట్ సౌకర్యములు కలిగించుటకు మొదలైన రంగాల్లో ఉప ఎన్నికలు సమర్ధవంతంగా మరియు సజావుగాను జరిపించినందుకు ఈ పురస్కారం ఎంపిక చేయబడ్డారు.

## రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు సిల్వర్‌ఓక్స్ విద్యార్థుల ఎంపిక



**నెల్లూరు,జనవరి24 ప్రభాతవార్త-విద్య** ఫిభవరిలో జరుగనున్న రాష్ట ఆర్చరీ పోటీల్లో పాల్గొనే జిల్లా ఆర్చరీ క్రీడాకారుల ఎంపికలను నగరంలోని స్థానిక ఏసీసుబ్బారెడ్డి క్రీడాప్రాంగణంలో జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఎంపికల్లో నగరంలోని స్థానిక సిల్వర్‌ఓక్స్ పాఠశాలలో చదువుతున్న 4 విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడలు ఎంపికైయ్యారు. ఈ సందర్బంగా మంగళవారం స్థానిక పాఠశాలలో విద్యార్దులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల నిర్వాహకులు షణు ్మక ఆచారి, వెంకట్రాదిలు ఈ సందర్బంగా మాట్లాడుతు తమ విద్యార్థులు అండర్-17 ప్రధమస్థాయిలో వివి.సాయి సాన్విక, ది ్వతీయస్థాయిలో జి.ప్రణునిలు ఎంపికైయ్యారన్నారు. అలాగే అండర్-14లో తృతీయస్థాయిలో ఏ.చాతుర్య,నాల్గస్థాయిలో ఎం.భావనలు ఎంపిక కావటం గర్వకారణమన్నారు. తమ పాఠశాలలో విద్యార్థులకు చదువుతోపాటూ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా ప్రోత్సహించటం జరుగుతుందన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా వీరు విజయం సాధించాలని కోరారు. అనంతరం ఎంపికైన వారికి పుష్పగుచ్చాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ బాలికల దినోత్సవ ర్యాలీ



**నెల్లూరుటౌన్, జనవరి 24, ప్రభాతవార్త:** జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఉదయం నెల్లూరు నగరంలోని సర్వోదయ డిగ్రీ కాలేజి నుంచి విఆర్ కాలేజీ వరకు ఐసీడీయస్, ఐసీపీయస్ సంయుక్త సౌజన్యంతో నిర్వహించిన ర్యాలీ విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా 250 మంది విద్యార్థినీలతో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందితో ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ పాల్గొని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆడపిల్ల విలువలను తెలియజేస్తూ స్లోగన్స్ ఇస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీని విఆర్ సెంటర్‌కు చేరుకుని మానవహారం నిర్వహించారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి బి.సురేష్ బేటీ బచావో బేటీ పడావో (ఆడపిల్లలను రక్షించండి... ఆడపిల్లలను చదివించండి...) గురించి అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ ర్యాలీలో ఐసీడీయస్ జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి కె.సౌజన్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎం.పెంచలయ్య, ఎన్ఎస్ఏపీవో ఉషారాణి, ఆర్ఐటి వరప్రసాద్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి వై.వెంకటయ్య, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా ఉపసంచాలకులు ఎం.రమాదేవి, డీవీఈవో కె.మధుబాబు, డీఈఎంవోబి శ్రీనివాస్, నెల్లూరు అర్బన్ సీడీపీవో బి.అనురాధ, బాలల సంరక్షణ అధికారిణి సి.హెచ్.సమత తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఉపాధి కూలీలకు కోటి 15 లక్షల పనిదినాలు



**రాపూరు, జనవరి 24 ప్రభాతవార్త** జిల్లాలో ఉపాధి కూలీలకు కోటి 15 లక్షల పనిదినాలు లక్ష్యంగా వున్నట్లు డ్వామా పీడీ వెంకట్రావు తెలిపారు. మంగళవారం ఆయన రాపూరులో రాపూరు,కలువాయి, సైదాపురం, మండలాల ఉపాధి సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఈ ఏడది లక్ష్యం తోలి విడతగా 85 లక్షలు పనిధినాలు కాగా అవి డిసెంబరు నాటికి పూర్తి అయినట్లు దీంతో ఆదనంగా మరో 35 లక్షల పనిదినాలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. రోజుకు 40 వేల పనిదినాలు లక్ష్యంగా పనిచేయాలని నిర్ణయించినట్లు పిడి తెలిపారు. ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లింపులుసకాలంలో చెల్లిస్తున్నట్లు తెలిపారు.ఉపాధి కూలీలకు రోజుకు రూ.257 వచ్చేలా సిబ్బంది చర్యలు తీసుకోని పనులు నిర్వహించాలని కోరారు. అలాగే పనుల వివరాలను ఎన్.ఎన్.యం.ఎస్ యాప్‌లో నమోదు చేయడం ద్వారా అవినితికి తావుండదని తెలిపారు. హార్టికల్చర్‌కు 200 ఎకరాలు టార్గెట్ కాగా ఉపాధి ద్వారా 500 ఎకరాలు పూర్తి చేసినట్లు తెలిపారు.ఇందుకు సంబందించి త్వరలో రైతులకు మెటిరీయల్ పేమెంటు అందజేయడం జరుగుతందని తెలిపారు. ఈ సమావేశంలో ఎపిడి శ్రీహరి రెడ్డి, ఎపిఓ చంద్రయ్య, యంపీడీఓ ఆమోష్ బాబు, సైదాపురం,కలువాయి ఎపిఓలు, ఇసిలు, టెక్నికల్‌అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గోన్నారు.

## 150 మంది విద్యార్దులకు ప్లేట్లు,గ్లాసులు పంపిణి



**బుచ్చి జనవరి 24 ప్రభాతవార్త:** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలోని రామచంద్రాపురం ప్రాధమికోన్నత పాఠశాల లో మంగళవారం సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డవల్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్దులకు ప్లేట్లు,గ్లాసులు పంపిణి చేశారు. ఈక్యాక్రమానికి ముఖ్య అతిధిగా కమీషనర్ చంద్రశేకర్‌రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్బంగా కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతు సహారాఎడు ్యకేషనల్ రూరల్ డవలప్‌మెంట్ సేవలు అభినందనీయమని నిర్వాహకులు యజ్ఞాని భాషాని ఆయన అభినందించారు.ఈ సందర్బంగా 150 మంది విద్యార్దులకు ప్లేట్లు, వాటర్ బాటిల్స్, అందజేశారు.ఈకార్యక్రమానికి సహకరించిన దాతలకు యజ్ఞాని బాషా ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్బంగా కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డిని, ఎంఇఒ దిలీప్‌కుమార్‌నిశాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.ఈకార్యక్రమంలో చింతంరెడ్డి శ్రీనివాసు లురెడ్డి, జిల్లా రిసోర్స్ గ్రూప్ సభ్యులు గండికోట సుధీర్‌కుమార్, ఉపాధ్యాయులు వేణు, బ్రహ్మారెడ్డి, విజయనిర్మల, విజయకుమారి, రసూల్‌బేగం, సచివాలయ సిబ్బంది, వాసు,శ్రీదర్, శ్రీలత, సిఆర్‌పి మల్లేశ్వరెడ్డి, పెంచలయ్య,తల్లిదండ్రులు పాల్గోన్నారు.

## కరటంపాడు హైస్కూల్లో జాతీయ బాలికాదినోత్సవ వేడుకలు



**ఆత్మకూరు,జనవరి24ప్రభాతవార్త:** మండలంలోని కరటంపాడు హైస్కూల్లో మంగళవారం హైస్కూల్ ప్రధానోపాధాయుడు తోట శ్రీనివాసులు ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్స వ వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా అన్ని తరగతుల్లో మంచి మార్కులు, హాజరు శాతం, నడవడిక ప్రాతిపధికతతో అన్ని తరగతుల బాలికలకు బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కన్నా ప్రస్తుతం బాలికలు మెరుగైన ప్రతిభ కనపరుస్తున్నారని , స్త్రీలు అభివృద్ధి చెందితే అది వారి కుటుంబం ,గ్రామం, దేశం అభివృద్ధి చెందుతుందని కానీ బాలికను బ్రతకనివ్వకుండానే పుట్టుక సమయంలోనే స్కానింగ్ చేసి తతెలుసుకుంటూ అబార్షన్ చేయించుకుంటున్నారని దీనిని పూర్తిగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ బాలికలను వెనుకబాటుతనంగా కాకుండా ముందుకు వెళ్ళేలా సహకరించాలన్నారు. దేశంలో ఏరంగంలో కూడా ప్రతిభలో ముందు వరుసలో బాలికలే , స్త్రీలే ఉంటున్నారన్నారు. ఈకార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలపై వ్యాసరచన పోటీలు




**కందుకూరు,జనవరి24,ప్రభాతవార్త:** 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్స వాల చివరిరోజు ఘనంగా ముగిసాయి.కందుకూరు మోటార్ రవాణా అధికారి రఫీ సారధ్యంలో పలు కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం పట్టణంలోని బాలుర,బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు భద్రతా వారోత్స వాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.విజేతలయిన వారికి బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా రవాణా అధికారి షేక్.మహ్మద్ రఫీ ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించారు.18సంవత్స రాల లోపు పిల్లలు ఎవ్వరూ వాహనాలు నడపరాదని తెలియజేశారు.ఎంఈవో వెంకటేశ్వర్ నాయక్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇప్పటి నుంచే ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకుని పాటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనురాధ,పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బ్రహ్మదేవం పంచాయతీలో బాలికల దినోత్సవం



**ముత్తుకూరు,జనవరి24,ప్రభాతవార్త:**ముత్తుకూరు మండలం బ్రహ్మదేవం పంచాయతీ పరిధిలోని జిసి కాలనీలో ఉన్న హైస్కూల్లో బాలికల దినోత్స వవేడుకలు నిర్వహించారు.బాల్య వివాహాల వల్ల జరిగే అనర్ధాల గురించి తెలియజేశారు.పిల్లల నడవడికను గురించితీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.సమాజంలో బాలికల పట్ల అనుచితంగా వ్యవహరించే వారిపై కఠినచర్యలు తీసుకోవడానికి ఏర్పాటు చేసిన చట్టాలను గురించి తెలియజేయడం జరిగింది.పలు అవగాహన కార్యక్రమంలో అంశాలను ప్రస్తావించారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లలితాంబ,ఎన్.రాజేశ్వరి,ప్రధానోపాధ్యా యులు సాయిప్రసాద్, ఉపాధ్యాయులు కరుణాకర్‌రెడ్డి, ఉదయభాస్కర్, పర్వీన్, చంద్రకళ, కామేశ్వరమ్మ, హరికుమార్,సుమలత తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో బాలికా దినోత్సవ వేడుకలు



**ఉలవపాడు,జనవరి24,ప్రభాతవార్త:** ఉలవపాడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాలికా దినోత్సవ వేడుకలు మంగళవారం నిర్వహించారు.రసాయణశాస్త్రఅధ్యాపకురాలు డాక్టర్ సుజాత మాట్లాడుతూ సమాజంలో బాలికలు,స్త్రీల పరిస్థితి గతం కంటే ఇప్పుడు కొంతమెరుగ్గా ఉన్నా చాలా మార్పులు రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.ప్రపంచ వ్యాప్తంగా భారతీయ మహిళలే ఉన్నత స్థానాలను అదిరోహించారని గుర్తుచేశారు. ఇందుకు మహిళలు ఎక్కువగా విద్యాభ్యాసం మూలంగా అనేకరుగ్మతల నుంచి బయటపడ్డారిన తెలియ జేశారు.బాలికల వివక్ష పూర్తిగా తొలగిపోవాలని కోరారు.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ జాతీయ బాలికా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించడం జరిగింది.ఈ సందర్భంగా వక్తృత్వ పోటీలు నిర్వహించారు.గెలుపొందిన విద్యార్థినిలకు బహుమతులు ప్రధానం చేశారు.

## వాలంటీర్లకుధృవీకరణపత్రాలుఅందజేత



**వరికుంటపాడు,జనవరి24, ప్రభాతవార్త :** నూతనంగా వాలంటీర్లగా ఎన్నికైన వాలంటీర్ల కు మంగళవారం ధృవీకరణ పత్రాలను మండల వైసిపి కన్వీనర్ అంద్రా బాల గురవారెడ్డి ,విరువూరు గ్రామ ఉపసర్పంచ్ పాలకొల్లు భాస్కర్‌రెడ్డి ,పంచాయతీ కార్యదర్శి విష్ణు లు అందజేశారు.ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ వాలంటీర్లగా ఎన్నికైన వాళ్ళు విధులలో జాగ్రత్తలు పాటించి,ప్రజలకు సేవ చేయాలన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమములో వైసిపినేతలు నాగభూషణం,వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాలికల హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలి




**కావలి, జనవరి 24 ప్రభాతవార్త:** సమాజంలో బాలికల హక్కుల రక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని కావలి వన్‌టౌన్ ఎస్ఐ ఆదిలక్ష్మి పిలుపునిచ్చారు. కావలి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మీ కోసం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన జాతీయ బాలికా దినోత్సవ వేడుకల కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్ఐ ఆదిలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థినులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు ధైర్యంగా వుండాలన్నారు. ప్రతి ఒక్కరు ఉన్నత విద్యావంతులై అనుకున్న లక్ష్యాల్ని సాధించాలన్నారు. ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు రక్షణ నిలయాలు వున్నాయన్నారు. సమాజంలో ఎవరికి భయపడకుండా అంకితభావంతో ఉన్నత విద్యనభ్యసించి బాగా రాణించాలని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రాయపాటి దిలీప్‌కుమార్, యం.మాలకొండారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు తనూజ, ఉపాధ్యాయలు వాణి సుకుమార్, సంస్థ జాయింట్ సెక్రటరీ ఆవులమంద శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కత్తి సందీప్‌కుమార్, బి.మురళీకృష్ణ తదితరులు పాల్గొని మాట్లాడారు. చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఆదిలక్ష్మిని ఘనంగా సత్కరించారు.

## ఆడపిల్లల్ని పుట్టనీయండి....పెరగనీయండి, బతకనీయండి




**కావలి, జనవరి 24 ప్రభాతవార్త:** సమాజంలో ఆడపిల్లల్ని పుట్టనిచ్చి, వారిని పెరగనిచ్చి బతికేలా అందరు పాటుపడాలని కావలి ఉమెన్ ఫోర్స్ కన్వీనర్, విశ్రాంత ప్రధానోపాధ్యాయిని చాకలకొండ శారద తెలిపారు. కావలి జనతాపేటలోని ఆంధ్రకేసరి మున్సిపల్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో కావలి ఉమెన్ ఫోర్స్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు 2008 సంవత్సరం నుండి జాతీయ బాలికా దినోత్సవాన్ని భారతదేశంలో జరుపుకుంటున్నారన్నారు. ప్రతి విద్యాలయంలో ప్రజా మహిళా సంఘాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని జాతీయ బాలికా దినోత్సవాల్ని జరపాలన్నారు. బాలబాలికల మధ్య వున్న 82:65 అక్షరాస్యత నిష్పత్తిని తగ్గించేందుకు ఆడపిల్లల్ని చదివించాలన్నారు. స్త్రీ, పురుషుల మధ్య జనాభా నిష్పత్తిని కూడా తగ్గించాలన్నారు. అందుకోసం బాలకల్ని పుట్టనీయాలని, పెరగనీయాలని, చదవనీయాలని, బతకనీయాలని ఆమె తెలిపారు. ఆడపిల్లలపై అత్యాచారాలు, అవిద్య, లింగవివక్షతల్ని పారదోలి అసమానతలను తగ్గించాలన్నారు.బాల్య వివాహాలను నివారించాలన్నారు. ఆడ లేనిదే మానవ జననం ఆగిపోయి మానవజాతి నశిస్తుందన్నారు. తల్లిదండ్రుల దృక్పదంలో మార్పు రావాలన్నారు. స్త్రీ భ్రూణహత్యల్ని నివారించాలన్నారు. టీచర్లు చదువుతో పాటు విద్యార్థులకు విలువలను కూడా నేర్పాలని ఆమె పిలుపునిచ్చారు. విద్యార్థులతో భేటి బచావో, భేటి పడావో అన్న నినాదాలు చేయించారు.

## అల్లూరులో జాతీయ బాలికా దినోత్సవం



**అల్లూరు, జనవరి 24 ప్రభాతవార్త:** రామిశెట్టి వెంకట సుబ్బారావు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్లూరు ఆక్స్‌ఫోర్డ్ స్కూలులో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ శిక్షణ కార్యనిర్వాహకురాలు త్రివేణి మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితులలో బాలికలు సమాజంలో దైనందిన కార్యక్రమాల్లో జాగ్రత్తలు, స్వీయ రక్షణ ప్రాముఖ్యతను వివరించారు. ఆత్మవిశ్వాసంతో వుండి అత్యుత్తమ విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అందుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థినులకు చిరుకానుకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామిశెట్టి వెంకట సుబ్బారావు ఛారిటబుల్ ట్రస్ట్ కుట్టు శిక్షణ ఉపాధ్యాయిని అమరావతి, పాఠశాల కరస్పాండెంట్ రవి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## ఆధార్ ప్రత్యేక క్యాంపులను సద్వినియోగం చేసుకొండి



**వరికుంటపాడు,జనవరి24, ప్రభాతవార్త :** ఆధార్ అప్‌డేట్ కోసం సచివాలయాల పరిధిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు డిఎల్‌డిఓ పద్మజా అన్నారు.మంగళవారం మండలంలో జరుగుతున్న ఆధార్ ప్రత్యేక క్యాంపులను ఆమె పరిశీలించి ,సిబ్బంది కి తగిన సలహాలు సూచనలు అందించారు.మండలంలోని బొగ్యంవారిపల్లి,కాకొల్లువారిపల్లి గ్రామాల్లో క్యాంపులలో మరింత మందికి ఆధార్ సేవలు అందేలా చూడాలన్నారు.అలాగే ఫిబ్రవరి 7,8,9 వ తేదిల్లో సైతం ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేయునున్నట్లు ఆమె తెలిపారు.ఈ కార్యక్రమములో ఎంపిడిఓ విజయ్‌భాస్కర్‌రావు,కార్యాలయ జూనియర్ సహాయకులు రామకృష్ణారెడ్డి,పంచాయతీ కార్యదర్శులు హరి,శ్రీనివాసులు ,డిజిటల్ అసిస్టెంట్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం



**నెల్లూరు కార్పొరేషన్, జనవరి 24, ప్రభాతవార్త:** జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మంగళవారం చిన్నబజార్ పోలీసుస్టేషన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ లతీఫున్నీసా ఆదేశాల మేరకు సబ్ ఇన్స్‌పెక్టర్ బృందం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కవిత వారి బృందం, వరలక్ష్మీ ఆధ్వర్యంలో బాలిక సంరక్షణ, బాల్యవివాహాలు, గర్ల్‌మిస్సింగ్, ఆహారపు అలవాట్లు, ఆరోగ్య సంరక్షణ, పౌష్టికాహారం, సమాజంలో బాలికల అభివృద్ధిపైన మూలాపేటలోని ఏనుగ సుందరరామిరెడ్డి మున్సిపల్ ఉన్నత పాఠశాల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో విద్యార్థినీలు, పాఠశాల ఉపాధ్యాయులు, మహిళా ఎస్ఐ, కానిస్టేబుల్ మాధవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, ఉపాధ్యాయులు, సిబ్బంది మహిళా పోలీసు కార్యదర్శులు శ్రీలక్ష్మీ, జ్యోతి, కల్పన, అశోక్‌కుమారి, వరలక్ష్మమ్మలు పాల్గొన్నారు. 2023 డిజిటల్ తరం - మా తరం అనే థీమ్‌తో సేవ్ గర్ల్ చైల్డ్‌పై ప్రమాణం చేయించారు.

## మహనీయుల విగ్రహా నిర్మాణ పనులు పరిశీలించిన కాకర్ల



**సీతారామపురం జనవరి 24 ప్రభాతవార్త:** తాలూకా మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో జరుగుతున్న మహనీయుల విగ్రహా నిర్మాణ కమీటి పనులను కాకర్ల చారిటబుల్ ట్రస్టు అధినేత కాకర్ల సురేష్ మంగళవారం పరిశీలించారు. విగ్రహా నిర్మాణ పనులు వీలైనంత త్వరగా పూర్తి కావడానికి తన వంతు సహాయం చేస్తానని అన్నారు. కాకర్లసురేష్‌ని మహనీయుల కమీటి విగ్రహా కమీటి సభ్యులు శాలువాతో సత్కరించారు.ఈకార్యక్రమంలో విగ్రహా కమీటికన్వీనర్ డాక్టర్ కలివెల ఎలీష్‌కుమార్, సలహాదారులు కలివెల బాలస్వామి,సీతారామపురం సర్పంచ్ కొడవటికంటి బాగ్యమ్మ,కమీటి అధ్యక్షులు నేలటూరు జాషువా, గుండ్లపల్లి తిరిపాలు,ప్రభాకర్, ఎ.వి రమణయ్య, కిరణ్, బుజ్జి, తిరపతయ్య, కమీటి సభ్యులు పాల్గొన్నారు.

## ముస్లింల ద్రోహి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

**కావలి, జనవరి 24 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ముస్లింల ద్రోహి అని రానున్న ఎన్నికలో ముస్లింలందరూ ఒకేతాటిపై నిలబడి జగన్‌రెడ్డిని ఇంటికి పంపాలని టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు పిలుపునిచ్చారు. కావలి పట్టణ 35వ వార్డు వైకుంతపురంలో మంగళవారం నాగూరు మీరావలి దర్గాలో మాలేపాటి ప్రత్యేక ప్రార్దనలు చేశారు. ఇదేమి ఖర్మ ఈ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి టిడిపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రంజాన్ తోఫా, దుల్హన్ పథకాలు అందడం లేదని, గత నాలుగు సంవత్సరాలుగా నాయకులు, అధికారులు ఈ ప్రాంతానికి వచ్చి పరామర్శించిన పాపానపోలేదని ముస్లింలు మాలేపాటికి మొరపెట్టుకున్నారు. ఆరోగ్యం సరిగా లేక ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్న వారికి ప్రభుత్వ పథకాలు నిలిపివేసి వారి జీవితాలతో జగన్‌రెడ్డి ఆడుకుంటున్నారని ముస్లింలు వాపోయారు. ఈ సందర్భంగా వార్డులో ప్రజల బాధలు చూసి మాలేపాటి చలించిపోయి మాట్లాడారు. బటన్ నొక్కి ప్రజలకు పథకాలు అందిస్తున్నానని వారికి ఏ బాధలు, సమస్యలు లేవని ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి చేస్తున్న ప్రచారం అంతా బూటకమన్నారు. వైసిపి ప్రభుత్వ పాలనలో గ్యాస్ ధర రెండింతలు పెరిగిందన్నారు. రాష్ట్రంలో డీజల్, పెట్రోలు ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. జగన్‌రెడ్డి ఇసుకను అమ్ముకుంటూ కార్మికులను రోడ్డు పాలుచేశాడన్నారు. మూడున్నరేళ్ల వైసిపి పాలనలో సహజ వనరులను దోచుకోవడం, ధరల పెంపుతో ప్రజల్ని వేధించడం, ప్రశ్నించే వారిపై దాడులు చేయడం తప్ప సాధించింది ఏమిలేదని దుయ్యబట్టారు. రైతులను ముప్పతిప్పలు పెట్టిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కిందని ఎద్దేవ చేశారు. రానున్న తెలుగుదేశం పార్టీ పాలనలో ఈ వార్డు సమస్యల్ని పూర్తి స్థాయిలో పరిష్కరించి వార్డు అభివృద్ధికి చర్యలు చేపడతామని మాలేపాటి హామీ ఇచ్చారు. జగన్‌రెడ్డి పాలనలో ప్రజలు పడుతున్న కష్టాలను తెలుసుకునేందుకే ఇంటింటికి టిడిపి కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర, పట్టణ ఉపాధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, యునిట్ ఇన్‌చార్జ్ మంచాల ప్రసాద్, తెలుగుయువత రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి కుందుర్తి కిరణ్‌కుమార్, ముస్లిం నేతలు నౌషాద్, ఖాదర్‌బాషా, నాగూర్ షరీఫ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మాలేపాటిని ముస్లింలు గజమాలతో సత్కరించి స్వాగతం పలికారు.

## చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తధ్యం



**ఇందుకూరుపేట జనవరి 24 ప్రభాత వార్త:**ఇందుకూరుపేట మండలం లేబూరు గ్రామంలో మంగళవారం తెలుగుదేశం పార్టీ ఇదేం ఖర్మ మన రాష్ట్రానికికార్యక్రమన్ని నిర్వహిం చారు .ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రదానకార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రతో వైసిపి ప్రబుత్వానికి అంతీమయాత్ర తప్పదని అన్నారు.ఈ సందర ్బంగా గ్రామస్తులు మేళతాళాలతో ఘనంగా స్వాగతించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి చివరి గడియలు దగ్గర పడ్డాయని తీవ్ర స్దాయిలో ద్వజమెత్తారు.మరలా రాష్ట్రం గాడిలోపడలాంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావలని అన్నారు. ఎన్ని కుట్రాలు పన్నినా నారా లోకేష్ పాదయాత్ర ఆపలేరని అన్నారు.ఈకార ్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు రావెళ్లి వీరేంద్రచౌదరి,చెంచుకిషోర్‌యాదవ్,చెముకుల కృష్ణ చైతన్య,కొండూరు సుధాకర్‌రెడ్డి, దొడ్ల నరేంద్రరెడ్డి, ఎం పిటిసి మధుసూదన్‌రెడ్డి,రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## బాలికలు అన్ని రంగాలలో ముందుండాలి

**కలువాయి జనవరి 24 ప్రభాతవార్త:** అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మండలంలోని పలు ప్రాంతాలలో కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు బాలికలు అన్ని రంగాలలో ముందుండాలని పేర్కున్నారు. మండలంలోని తోపుగుంట ప్రాధమిక పాఠశాల నందు ప్రధానోపాధ్యాయులు ప్రసాద్‌రావు ఆద్వర్యంలో నిర్వహించిన ఈకార ్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ,టీచర్లు, విద్యార్ధులు పాల్గొన్నారు. అదే విధంగా కుల్లూరులోని ప్రభుత్వ జూనియర్ కాలేజి నందు నిర్వహించిన జాతీయ సేవా పథకం అద ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈకార్యక్రమంలో ప్రిన్సి ఫల్ భక్తవత్స ల్ రెడ్డి,పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ శివప్రసాద్,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జై కిషోర్,అద్యాపక,అద్యాపకేతర సిబ్బంది,వైద్యసిబ్బంది పాల్గోన్నారు. అదే విధంగా కేశమనేని పల్లిలో అంగన్‌వాడీ కేంద్రం నందు జాతీయ బాలికల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు.దాచూరు సెక్టార్ అంగన్‌వాడీ సూపర్ వైజర్ పద్మజా అంగన్‌వాడీ టీచర్లు మహిళా పోలీసు ఎంఎల్‌హెచ్ఒ ,ఎఎన్ఎం,అంగన్‌వాడీ హెల్పర్లు పాల్గోని విద్యార్దులనుద్దేంచి మాట్లాడారు.గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

## పాఠశాల ఉపాధ్యాయులకు మొక్కలు అందజేసిన హ్యాపీ సేవాసంస్థ



**కలిగిరి, జనవరి24, ప్రభాతవార్త;**కలిగిరి మండలం శిద్దనకొండూరు జడ్పీ హైస్కూల్లో మంగళవారం జీతీయ బాలికా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న కావలికి చెందిన హ్యాఫీ సేవాసంస్థ బాలికల దినోత్సవ కార్యక్రమానికి హాజరైనారు. ఈసందర్బంగా పాఠశాల ప్రదాన పోపాద్యాయులు లక్ష్మీకాంతం గానికి హ్యాఫీ సేవాసంస్థతరపున పాల్గొన్న ఆసంస్త అద్యక్షులు సయ్యద్ ఘనీ బాష మెచ్‌యంగారికి మొక్కలు అందజేసి బాలికా దినోత్సవ శుభాకాంక్షలుతెలిపారు. అనంతరం పాఠశాల ప్రధానోపాద్యాయులు మాట్లాడుతూ ఆడబిడ్డ ఇంటికి వెలుగు, కంటికి వెలుగూ ఆడబిడ్డను కాపాడండి. ఆడపిల్లలను రక్షించండి అంటూఉద్బోదించారు. ఈకార్యక్రమంలో తోటి ఉపాధ్యాయులు హ్యాఫీ సంస్త కార్యదర్సి ఆంచిపక హజరత్తయ్య,పాలేటి పవన్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఉపసర్పంచి సాయం



**కలిగిరి, జనవరి24, ప్రభాతవార్త;**అనారోగ్యంతో ఇంటి యజమాని మృతిచెందిన కుటుంబానికి కలిగిరి ఉపసర్పంచిఆర్ధిక సాయం అందజేసిన సంఘటన మంగళవారం కలిగిరిలో జరిగింది. మండలకేంద్రమైన కలిగిరి యస్టీకాలనీకి చెందిన వేటగిఆరి వెంకయ్య కలిగిరి డంపింగ్ యార్డు పక్కన నివాసముంటూ ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతిచెందాడు.ె ఎదకుటుం భమైన వారు ఆదుకునేవారి కోసం ఎదురు చూస్తున్న సమయంలో కలిగిరి ఉపసర్పంచి పాలూరి కొండారెడ్డి చారిటిబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్ధిక సహాయ మండజేశారు.ఈ సందర్బంగా కొండారెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలిబ్బందుల్లో ఉండగా ఆదుకోవడంలో ఆదుకోవడం తన కర్తవ్యంగా భావిస్తానన్నారు.

## బాలికలను కాపాడుకుందాం

**చేజర్ల,జనవరి24ప్రభాతవార్త:** బాలికల భవిష్యత్తును కాపాడుకునేందుకు సమాజంలోని అందరూ ముందుకు రావాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి పేర్కొనా న్నరు. జాతీయ బాలికాదినోత్సవం సందర్భంగా మండలంలోని గురుకుల పాఠశాలలో విద్యార్ధినిలకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చేయడం వలన కలిగే అనర్ధాలు, గుడ్‌టచ్-బాడ్‌టచ్, హెల్ప్‌లైన్, లింగవివక్ష, ట్రాప్ చేయడం తదితర విషయాలపై అవగాహన కల్పించారు .వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం వలన ఆరోగ్యంగా ఉంటారని, ఆరోగ్య నియమాల గురించి వివరించారు. బాల్యవివాహాల గురించి వచ్చే అనర్ధాలను తెలిపారు. రోజురోజుకి ఆడపిల్లల పట్ల జరుగుతున్న దాడులు , సమాజంలోని మార్పులను గుర్తించి జాగ్రత్త పడాలని సూచించారు. ప్రిన్స్‌పాల్ భీమవరపు శైలజాకుమారి బాలికల ఆరోగ్యం పట్ల సమాజంలో జరుగుతున్న పరిణామాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ వై.సుబ్బరత్నమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.కృష్ణవేణి, పాపమ్మ , గురుకుల పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు .

## ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం



**బుచ్చి జనవరి 24 ప్రభాతవార్త** భారతదేశంలో ప్రతి సంవత్సరం జనవరి 24న జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగా బుచ్చిరెడ్డిపాళెం బాలికల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అంతర్జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా ర్యాలీ నిర్వహించి ,తరువాత సమావేశం నిర్వ హించారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శకుంతలా, ప్రధానోపాధ్యాయురాలు సుజాత విద్యా ర్థులకు బాలికల హక్కుల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో ఎంఎస్‌కె లక్ష్మి, ఎఎన్‌ఎం కె.రమాదేవి, అంగన వాడీ టీచర్లు, స్కూల్ టీచర్లు, బాలికలు పాల్గొన్నారు.

## దాతల సహకారంతో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం



**బిట్రగుంట, జనవరి 24 ప్రభాతవార్త** బిట్రగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యనభ్యసిస్తున్న 160 మంది విద్యార్థిని, విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసేందుకు మంగళవారం దాతలు ముందుకొచ్చారని కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. కాంద్ర సతీష్‌నాయుడు విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుండి కళాశాల పనిదినాలు పూర్తయ్యేంత వరకు రోజుకు 12 కేజీల చొప్పున బియ్యం సమకూర్చేందుకు ముందుకు రాగా అమరా బచ్చు ఛారిటబుల్ ట్రస్ట్ తరపున ఆర్గనైజర్ డాక్టర్ ఆనందసాగర్ ఇందుకు సరిపడా నిత్యావసర వస్తువులు, కూరగాయలు సరఫరా చేసేందుకు ముందుకు వచ్చినట్లు వెల్లడించారు. ఇందుకు సహకరించిన కాంద్ర సతీష్‌నాయుడు యువనేస్తం సభ్యులు బాపట్ల వెంకటపతి, పీట్ల సతీష్, గోవాల బాలశైలజాకుమారికి, అమరా బచ్చు ఛారిటబుల్ ట్రస్ట్ తరపున డాక్టర్ ఆనందసాగర్‌కు విద్యార్థుల తల్లిదండ్రుల తరపున కృతజ్ఞతలు ఆమె తెలిపారు.

## గుత్తి సుబ్బారావు దాతృత్వం అభినందనీయం



**సంగం జనవరి 24 ప్రభాతవార్త** మండలకేంద్రమైన సంగంలోని బిసి బాలకల వసతి గృహానికి కోవూరుకి చెందిన రిటైర్డ్ ఎలక్ట్రికల్ ఏ.ఇ గుత్తి సుబ్బారావు సుమారు 20 వేల రూపాయాలు విలువ కలిగిన టి.వి.ని బహుకరించారు. ఈ సందర్బంగా సంక్షేమాధికారిణి మల్లేశ్వరీ ఆయనకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతు సుబ్బారావు దాతృత్వానికి నిర్వచనం అని అన్నారు. ఆయన ప్రతి నెల అనాధ పిల్లల ఆశ్రమానికి నిత్యావసర సరుకులు దాతృత్వం చేస్తుంటారని, అలాగే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఆయన ఎంతో సహకరిస్తుంటారని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్బంగా ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలికలకు చట్టాలపై అవగాహన



**బుచ్చి జనవరి 24 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రేబాల గ్రామంలో ని హైస్కూల్‌లో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత బాలికల చట్టాల గురించి వివరించారు. బాల్యవిహాలు, పోక్సో చట్టం, చైల్డ్ ట్రాఫికింగ్ ( మిస్సింగ్‌గర్ల్స్) గురించి అవగాహన కల్పించారు. ఆడపిల్లలుదృడమనస్తత్వం కలిగి ఉండాలని ఆమె సూచించారు. ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆమె సూచించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్దులు, బాలికలు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



**బిట్రగుంట, జనవరి 24 ప్రభాతవార్త** బోగోలు మండలం విశ్వనాధరావుపేట పంచాయతీలో మంగళవారం ఘనంగా జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా గ్రామ సర్పంచ్ గండూరు మంజుల మొక్కలు నాటడంతో పాటు బాల్య వివాహాలు, సమాన హక్కులు గురించి విద్యార్థినులకు వివరించారు. ఉపసర్పంచ్ పెండ్లి వెంకటేశ్వర్లు, వైసిపి నేత గండూరు శ్రీనివాసులు, మహిళా పోలీస్ సెలీనా, అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్మల, లక్ష్మి, జాన్సీ, ఆదిలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**కోవూరుపల్లిలో...**కోవూరుపల్లి గిరిజన కాలనీలోని మండల పరిషత్ పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం సందర్బంగా మొక్కలు నాటి విద్యార్థినులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ ఉద్యోగిని కె.మౌనిక, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిత్యపూజయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, అనూష తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవెంకటేశ్వర కళాశాలలో ఘనంగా “జాతీయ బాలికల దినోత్సవం”

**కొడవలూరు జనవరి 24 ప్రభాతవార్త :** కొడవలూరు మండలం, నార్త్‌రాజుపాలెంలోని శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల నందు మంగళవారం జాతీయ బాలికల దినోత్సవంను కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. కుమార్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ సి. సాయిదీప్తి విచ్చేశారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ విద్యార్థులు మంచి పోషక ఆహారం తీసుకోవడంతో పాటు, వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధవహించాలని కోరారు. ఏదైన సమస్య వచ్చినపుడు ధైర్యంగా ఎదురుకోవాలని, ఎద్దైనా ఆనారోగ్యం వచ్చినపుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కళాశాల ఛైర్మన్ పెనుబల్లి బాబునాయుడు, డైరెక్టర్ పెనుబల్లి కృష్ణచైతన్య, డబ్ల్యూజిఆర్‌సి కోఆర్డినేటర్ ఎం. మెర్సిలిధియా, ఇతర అధ్యాపక మహిళా సిబ్బంది ఎస్. నర్మద, ఎస్‌డి. మౌసిన, బి. సుప్రజ, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆడపిల్లలు దేశానికి గర్వకారణం



**బుచ్చి జనవరి 24 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పెనుబల్లి హైస్కూల్‌లో బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ దిలీప్‌కుమార్ మాట్లాడుతు ఆడపిల్ల దేశానికే గర్వకారణమని అన్నారు. భారత దేశ ఏకైక మహిళా ప్రధాని ఇందిరాగాంధీ ప్రధానిగా పదవీ స్వీకారం చేసిన జనవరి 24ను అప్పటి ప్రభుత్వం 2009లో బాలికా దివస్‌గా ప్రకటించిందని తెలిపారు. బాలికా విద్యను ప్రోత్సహించడం, బాలికలు అన్ని రంగాల్లో ముందుకు సాగడం, బాలికల కోసం చేసిన చట్టాలు వారికి అవగాహన కల్పించడమే బాలికా దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. ప్రధానమంత్రి బాలికలకోసం బేటీ బచావో-బేటీ పడావో, సుకన్య సమృద్ధి యోజన్ లాంటి పథకాల్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ సందర్భంగా విద్యార్ధులకు ఇందిరాగాంధీ జీవిత చరిత్ర గురించి వివరించారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉమా, ప్రధానోపాధ్యాయులు ,అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కనిగిరి రిజర్వాయర్ కట్టలు కాపాడండి



**బుచ్చి జనవరి 24 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం కనిగిరి రిజర్వాయర్ రక్షణ కట్టలను గ్రావెల్ మాఫీయా నుండి కాపాడాలని బిజెపి నాయకులు తహసిల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. బిజెపి నగర అద్యక్షులు రామిశెట్టి మోహన్ ఆద్వర్యంలో ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. నమామి గంగే ( జల సంరక్షణ) రాష్ట్ర ప్రముఖ్ మిడతల రమేష్ మాట్లాడుతు రైతుల ప్రయోజనాల కోసం బ్రిటిష్ కాలంలో కాటన్ దొర కనిగిరి రిజర్వాయర్ కట్టారని ఆయన తెలిపారు. కనిగిరి రిజర్వాయర్‌కి గ్రావిల్ కట్ట చాలా కీలకమైనది ప్రస్తుతం గ్రావిల్‌మాఫీయా దీనిని అక్రమంగా తరలించి వేస్తున్నారు. ఇది ఇలానే కొనసాగితే వరదలు వచ్చి గ్రామాలకు గ్రామాలు కొట్టుకొని పోవడం తద్యమని అన్నారు. అనంతరం జిల్లా నాయకులు కాసా శ్రీనివాసులు మాట్లాడుతు పేదల ఇండ్ల స్థలాలకు గ్రావిల్ అని చెప్పి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్బంగా సీనియర్ అసిస్టెంట్ కొండలరావుకి వినతి పత్రం అందజే శారు. ఈకార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి కాసా శ్రీనివాసులు, నాయకులు గంగపట్నం శ్రీనివాస్‌తేజా, ఉపాధ్యాక్షులు సందల నాగేశ్వరరావు, బిజెవైఎం మండలా ద్యక్షులు గోలి సురేంద్ర, ఓబిసి మోర్చ మండలాద్యక్షులు బూదారపు రవీంద్ర, నీలం వెంకటేశ్వర్లు, వంశీ,అఖిల్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆలయాల్లో జనసేన కార్యకర్తల పూజలు



**కోవూరు, జనవరి24ప్రభాతవార్త :** జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చేపడుతున్న వారాహి యాత్ర విజయవంతం కావాలని కోరుతూ కోవూరు మండల జనసేన ఆధ్వర్యంలో స్థానిక వీరాంజనేయ స్వామి దేవస్థానంలో పడుగుపాడు గంగా పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా జనసేన మండల పార్టీ అధ్యక్షుడు అల్తాఫ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి చేయాలనే తపనతో ప్రతి జనసైనికుడు ముందుక సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సంయుక్త కార్యదర్శి పి. మారుతి తన్మయ్, జనసేన నేతలు ఎన్ రఘు, సురేంద్ర, దిలీప్‌కుమార్, విజయ్, మాబాషా, సంతోష్, అఖిల్, జ్యోతిష్, వంశీలు ఉన్నారు.

## ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించే దిశగా ముందుకు సాగాలి



**కోవూరు, జనవరి24ప్రభాతవార్త** : ప్రతి విద్యార్థిని ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించే దిశగా ముందుకు సాగాలని కోవూరు సీఐ కె. రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. కోవూరులోని సాంఘిక సంక్షేమ వసతి గృహ సముదాయంలో మంగళవారం సాయంత్రం బాల్య వివాహాలు, తదితర అంశాలపై సింహపురి ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ప్రతి విద్యార్థిని ముందుకు సాగాలన్నారు. అదేవిధంగా 18 సంవత్సరాలు దాటిన తర్వాత మాత్రమే వివాహం చేసుకోవాలే తప్ప, బాల్య వివాహాలు చేసుకోవడం వలన అనేక అనర్థాలు ఉన్నాయన్నారు. అదేవిధంగా మిమ్మల్ని ఎవరైనా టీజ్ చేసినా, అవమానించినా, ఇబ్బందులకు గురి చేసినా, 100,112కు ఫోన్ ఏసి సమాచారం ఇవ్వాలన్నారు. అదేవిధంగా ఎక్కడైనా ప్రమాదాలు జరిగినప్పుడు మీ దృష్టికి వస్తే వెంటనే ఆ సమాచారాన్ని కూడా ధైర్యంగా పోలీసుల దృష్టికి తేవాలన్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, రాజ్యలక్ష్మి, రాధికలు బాల్య వివాహాలు చేసుకోవడం వలన ఏ విధమైన నష్టాలు వస్తాయో వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమాధికారులు పద్మ, సునీత, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ట్రస్టు ఆధ్వర్యంలో విద్యాపరమైన మెటీరియల్స్ పంపిణీ




**కోవూరు, జనవరి24ప్రభాతవార్త : కోవూరులోని** పడుగుపాడు , కొత్తూరు రోడ్డులో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు కొమారి రెడ్డయ్య 3వ వర్థంతి సందర్భంగా రెడ్డయ్యచారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు, విద్యాపరమైన వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్మన్ కొమారి ప్రసాద్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా తమ ట్రస్టు ద్వారా ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతూనే ఉన్నామన్నారు. విద్యార్థులు కూడా చక్కగా చదువుకుని తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి శంకర్‌రావు, ట్రస్టు సభ్యులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో బాలికా దినోత్సవం



**కోవూరు, జనవరి24ప్రభాతవార్త :** కోవూరు మండలం లేగుంటపాడులోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బాలికా దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, రాధికలు విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు కూడా బాలికలను చక్కగా చదివించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్‌కుమార్, అంగన్‌వాడీ కార్యదర్శులు సుజాత, తదితరులు ఉన్నారు. గుమ్మలదిబ్బ గ్రామంలో మంగళవారం బాలికా దినోత్సవం సందర్భంగా ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుమిత్ర, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

## నెల్లూరు కళలకు పుట్టినిల్లు



**నెల్లూరుటౌన్, జనవరి 24, ప్రభాతవార్త:** సకల కళలకు నెల్లూరు పుట్టినిల్లు లాంటిదని పినాకినీ యూత్ వెల్‌ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్‌రాజు అన్నారు. పినాకినీ యూత్ వెల్‌ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని శ్రీ రేబాల లక్ష్మీ నరసారెడ్డి స్మారక భవనం (టౌన్‌హాలు) నందు కవి విశ్వేశ్వరశర్మ స్మారక సాహిత్య సేవా పురస్కారాల ప్రధానోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మురళీమోహన్‌రాజు మాట్లాడుతూ సమాజ సేవకులను సత్కరించడం అదృష్టంగా భావిసప్తున్నామన్నారు. ముందుగా విశ్వేశ్వర శర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అవార్డు గ్రహీతలు డాక్టర్ రాచపాళెం రఘు, కె.వరలక్ష్మి, దేవరం బ్రహ్మారెడ్డి, అరవ రాయప్ప, టి.ఎ.పద్మనాభంలను మొమెంటో, శాలువా, కిరీటం అలంకరణలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పేర్నపాటి శ్రీరామరాజు, శ్రీధర్‌రావు, ఎస్.వి.రమేష్‌బాబు, టి.వెంకటేశ్వర్లు, అళహరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## టివై రాష్ట్ర కార్యదర్శిగా వడ్లమూడి.రమేష్‌చౌదరి

**నెల్లూరు జనవరి 24, ప్రభాతవార్త-వైద్యం** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా.చంద్ర బాబు నాయుడు ఆదేశాల మేరకు, టీడీపీ రాష్ట్ర తెలుగుయువత కమిటీలో అదనపు నియాయకాలు చేస్తూ తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నాయుడు మంగళవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. అందులో భాగంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి చెందిన వడ్లమూడి.రమేష్‌చౌదరిని రాష్ట్ర తెలుగుయువత కార్యదర్శిగా నియమిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు ఒ ప్రకటనలో వెల్లడించారు.

## యువగళానికి అనుమతులు హర్షణీయం




**నెల్లూరు జనవరి 24, ప్రభాతవార్త-వైద్యం** యువగళం పాదయాత్రకు అనుమతి రావడం హర్షించదగ్గవిషయమని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి ఇదే శుభసూచకమని తెలుగుదేశం పార్టీ నగర నియోజకవర్గ అధ్యక్షుడు ధర్మవరం.సుబ్బారావు ఆనందాన్ని వ్యక్తం చేశాడు. మంగళవారం నగరంలోని గుప్తా పార్కు సమీపంలో ఉన్న ధర్మవరం.సుబ్బారావు తన పార్టీ కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా లోకేష్ పుట్టినరోజుని పురస్కరించుకుని చేసిన పూజల ఫలితం నేడు పాదయాత్ర అనుమతితో సాకారం అయిందన్నారు. కుప్పం నుండి ఇచ్చాపురం వరకు చేపట్టబోయే యువగళం పాదయాత్ర తథ్యమన్నారు. మన రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు కులమతాలు, పార్టీలకు అతీతంగా పాదయాత్రలో లోకేష్‌బాబుతో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మన హక్కులను కాలరాస్తున్న ఈ వైసీపీ దుర్మార్గపు పాలనకు స్వస్థి పలకాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అది దృష్టిలో ఉంచుకుని లోకేష్‌ని ఆశీర్వదించాలన్నారు. టీడీపీ మహిళా నేతలు సరోజనమ్మ, వజ్రవతమ్మ, ధర్మవరం.గణేష్‌కుమార్, వీరమల్లు.చంద్ర, నెల్లూరు.రమేష్, కరిమల.ప్రభు పాల్గొన్నారు.

## రామకృష్ణారెడ్డి వర్ధంతి సందర్భంగా అన్నదానం



**నెల్లూరు జనవరి 24, ప్రభాతవార్త-వైద్యం** భారతీయ జనతా పార్టీ దివంగత నేత చెరుకుపల్లి.రామ కృష్ణారెడ్డి 24వ వర్ధంతి సందర్భంగా వారి ఆత్మకు శాంతి చేకూరాలని భారతీయ జనతా పార్టీ మజ్దూర్ మో ర్చా ఆధ్యర్యంలో నగరంలోని సింహపురి హాస్పిటల్ ప్రాంతంలో ఉన్న ఆటో యూనియన్, కాయల.మధు, మునూరు.సుబ్బారావు, ఆటో స్టాండు అధ్యక్షుడు ఇళ్ళపు.వంశీ ఆధ్వర్యంలో మంగళవారం పేదలకు అన్నదానం చేశారు. మొదట రామకృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల పక్షపాతి రామకృష్ణారెడ్డి అని, బీజేపీకి ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు. అహర్నిశలు పేదలు, న్యాయం, పార్టీ కోసం పాటుపడిన వ్యక్తన్నారు. అలాంటి ఈరోజు మా మధ్యన లేకపోవడం చాలా భాదకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు మండ్ల.ఈశ్వర్యయ్య, లీగల్‌సెల్ రాష్ట్ర పదాధికారులు దాసరి.ప్రసాద్, కెవి, రాయపు.హరి, మండల అధ్యక్షుడు చైతన్య తదితరులు పాల్గొన్నారు.

**శెట్టిగుంటరోడ్‌లో** స్వర్గీయ చెరుకుపల్లి.రామకృష్ణారెడ్డి 24వ వర్ధంతి సందర్భంగా స్థానిక బీజేపీ మండల అధ్యక్షుడు పైడిమాను.ఆదినారాయణ ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి చిత్రపటానికి పలువురు బీజేపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ తరుణంలో బిజెపీ నేతలు మిడతల.రమేష్, మండల.ఈశ్వరయ్యలు మాట్లాడుతూ రామకృష్ణారెడ్డి జన హృదయ నేతగా ఇప్పటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయారని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల సమస్యలు పరిష్కరిస్తూ సమాజంలోనే చైతన్యం తీసుకువచ్చిన వ్యక్తి అని పేర్కొన్నారు. ఆయన లేనిలోటు బీజేపీలో ఇప్పటికి కొట్టుకొచ్చినట్లు కనిపిస్తోందని వారు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కెవి.సుబ్రమణ్యం, సృజన, జైచంద్ర, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్‌అజీజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వడ్లమూడి.రమేష్



**నెల్లూరు జనవరి 24, ప్రభాతవార్త-వైద్యం** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా.చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర తెలుగుయువత కమిటీలో అదనపు నియామకాల్లో రాష్ట్ర టివై కార్యదర్శిగా వడ్లమూడి.రమేష్‌చౌదరి పదవి అందుకున్న తరుణంలో, నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అబ్దుల్‌అజీజ్‌ను, నగరంలోని హంనాథపురంలో ఉన్న ఆయన నివాసంలో మర్యా దపూర్వకంగా మంగళవారం రమేష్ కలిశారు. ఈ సందర్భంగా అబ్దుల్‌అజీజ్‌ను శాలువా కప్పి సత్కరించి, తనకు ఈ పదవి వచ్చేలా కృషి చేసినందుకు అబ్దుల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి ఈ బాధ్యతను తనకు అప్పగించినందుకు తాను ఎల్లవేళలా పార్టీకి విధేయుడుగా ఉంటూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

## వైష్ణవిని సన్మానించిన పిడి సౌజన్య



**సంగం జనవరి 24 ప్రభాతవార్త** మండలకేంద్రమైన సంగంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వైష్ణవిని ఐసిడిఎస్ పిడి సౌజన్య సన్మానించారు. సేవ్ గర్ల్స్,సేవ్ చైల్డ్ అనే అంశంపై జిల్లా స్థాయిలో పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలలో సంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి వైష్ణవి (పదోతరగతి) జిల్లా స్థాయిలో తృతీయ స్థానం సాధించినందుకు ఆ బాలికను ఘనంగా సన్మానించారు. జిల్లా కలెక్టర్ ద్వారా 3 వేల రూపాయాలు క్యాష్ ప్రైజ్ మనీ,మెమోంటో,సర్టిఫికేట్, అందించారు.శాలువాల కప్పి సత్కరిం చారు. ఈకార్య క్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ,డ్రాయింగ్ టీచర్ తిరుపతయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డివైడర్‌ని ఢీకొన్న కారు...ఒకరు మృతి



**కావలి రూరల్, జనవరి 24 ప్రభాతవార్త** కావలి రూరల్ మండలం గౌరవరం జాతీయ రహదారిపై మంగళవారం కారు అదుపుతప్పి డివైడర్‌ని ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా నలుగురికి గాయాలైనాయి. కావలి రూరల్ పోలీసుల సమాచారం మేరకు వివరాలు ఇలావున్నాయి. తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం తనియలి గ్రామానికి చెందిన సంచి రమణమ్మ, శ్యామ్. శ్రావణి, భానుప్రకాష్, మోక్షిత్ రాజులు హైదరాబాద్‌కు వెళ్లారు. సంచి రమణమ్మ కుమారుడు, కోడలు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండటంతో వారికి ఇల్లు వెతకడానికి వీరంతా వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలోని కావలి రూరల్ మండలం గౌరవరం జాతీయ రహదారి వద్దకు వచ్చేసరికి లారీని తప్పించబోయి డివైడర్‌ని కారు ఢీకొట్టి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంతో సంచి రమణమ్మ(64) అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిన వారిని 108లో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారని పోలీసులు తెలిపారు. సంచి రమణమ్మ మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కావలి రూరల్ ఎస్ఐ వెంకట్రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అక్స్‌ఫర్డ్ స్కూల్‌లో స్పోర్ట్స్ మీట్



**కందుకూరు, జనవరి24, ప్రభాతవార్త** కందుకూరు పామూరు రోడ్డులో ఉన్న ఆక్స్ ఫర్డ్ ఒలంపియాడ్ పాఠశాలలో మంగళవారం స్పోర్ట్స్ మీట్ ఘనంగానిర్వహించారు.ఘనతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని స్థానికపాఠశాలలో నిర్వహిస్తున్నారు.బాల,బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని కళాశాల చైర్మన్ ఉన్నంభాస్కర్‌రావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల్లో గెలుపు,ఓటమిలు సహజమనిక్రీడా స్ఫూర్తితో ఆడాలని తెలియజేశారు.పాఠశాల డైరెక్టర్ బాలభాస్కర్ మాట్లాడుతూ క్రీడలు శారీరక,మానసికఆనందాన్నిస్తాయని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో బండి వెంకటేశ్వర్లు,డైరెక్టర్ బి.నరేంద్రబాబు,ప్రిన్సి పాల్ రామారావు,మల్లికార్జునరావు,పాఠశాల అధ్యాపకులు హాజరైయ్యారు.

## మహిళలు స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించాలి



**కోవూరు, జనవరి 24 ప్రభాతవార్త :** మారుతున్న కాలానికి అనుగుణంగా సమాజంలో వస్తున్న స్వయం ఉపాధి రంగాలపై మహిళలు ప్రత్యేక దృష్టి సారించి తమ ఆర్థికాభివృద్ధిని ఘనీయంగా పెంచుకోవాలని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పరిధిలో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 10 మంది మహిళలకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళా అభివృద్ధికి వినూత్న పథకాలను కూడా ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. వాటిని ఉపయోగించుకుని అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, బొందిలి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కిషోర్ సింగ్, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి,డీఎల్‌డీఏ చైర్మన్ విజయ్‌కుమార్, డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఎంపీపీ టి. పార్వతి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎన్. హరిప్రసాద్‌రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ సుబ్బారెడ్డి, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షాజహాన్, గ్రామ సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ అహ్మద్, జలజీవన్ మిషన్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ రాకీ, వైసీపీ నేతలు శ్రీనివాసులురెడ్డి, విజయసేనారెడ్డి, ఎం. చిరంజీవి, కె. మల్లికార్జున, కె. ప్రసాద్, ఉన్నారు.

## ఇనమడుగు విద్యార్థినికి జిల్లా స్థాయి బహుమతులు



**కోవూరు, జనవరి24ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు బాలికోన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని వి. అనుశ్రీ వకృత్వ, వ్యాసరచన పోటీల్లో 4 స్థానం, 5వ స్థానం సంపాదించి తమ పాఠశాల పేరును మరింత ఇనుమడింపజేసిందని పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాధారాణి తెలిపారు. మంగళవాకం బాలికా దినోత్సవ సందర్భంగా తిక్కన భవనంలో జరిగిన బహుమతి ప్రధానోత్సం కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ పెంచలయ్య , ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సౌజన్య చేతులమీదుగా శాలువా, మెమెంటో, నగదు బహుమతిని పొందారు. ఈ సందర్భంగా అనుశ్రీని ప్రత్యేకంగా అభినందించారు.

## వలంటీర్ కుటుంబాన్ని ఆదుకున్న కోవూరు ఎమ్మెల్యే



**కోవూరు, జనవరి24ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీకి చెందిన వలంటీర్ కె. అఖిల ఇటీవల ప్రసవ వేదనలో ఫిట్స్ వచ్చి మృతిచెందింది. ఈ విషయాన్ని తెలుసుకున్న కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ. 50 వేలను ఆ కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, బొందిలి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కిషోర్ సింగ్, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి,డీఎల్‌డీఏ చైర్మన్ విజయ్‌కుమార్, డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఎంపీపీ టి. పార్వతి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎన్. హరిప్రసాద్‌రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ సుబ్బారెడ్డి, , తదితరులు ఉన్నారు.

## నాడు-నేడుతో పాఠశాలల అభివృద్ధి వేగవంతం



**కోవూరు, జనవరి24ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల అభివృద్ధికి శ్రీకారం చుట్టారని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి కొనియాడారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం నాడు-నేడు ద్వారా 24 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో గతంలో పోలిస్తే హాజరు శాతం ఘనీయంగా పెరిగిందన్నారు. ముఖ్యమంత్రి మేదస్సు నుంచి వచ్చిన అమ్మఒడి, జగనన్న గోరుముద్ద పథకాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, బొందిలి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కిషోర్ సింగ్, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి,డీఎల్‌డీఏ చైర్మన్ విజయ్‌కుమార్, డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఎంపీపీ టి. పార్వతి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎన్. హరిప్రసాద్‌రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ సుబ్బారెడ్డి, మండల విద్యాశాఖ అదికారి రహీమ్, ఉన్నారు.

## ఒకే రోజు మూడు ఆలయాలలో చోరి



**సంగం జనవరి 24 ప్రభాతవార్త** సంగం మండలంలోని మర్రిపాడు గ్రామంలోని ఎస్‌సి కాలనీలో ఒకే రోజు మూడు ఆలయాలలో చోరి జరిగింది. ఆలయాలలో తాళిబొట్లు, హుండీలు పగులగొట్టి నగదు చోరి చేశారు. విషయం తెలిసిన వెంటనే స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గ్రామానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.ఎస్ఐ నాగార్జునరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.అలాగే క్ల్యూస్ టీం సంఘటనా స్థలంలో వేలిముద్రలు స్వీకరించారు.

## సచివాలయాల్లో సేవలను పెంచండి



**వరికుంటపాడు,జనవరి24, ప్రభాతవార్త** :గ్రామ సచివాలయాల్లో ప్రజలకు అందించే సేవలను మరింత పెంచి ,ప్రభుత్వ ఆశయాలను కాపాడాలనీ కందుకూరు డిఎల్‌డిఓ పద్మజా అన్నారు.మంగళవారం మండలంలోని తిమ్మారెడ్డి పల్లి ,రామాపురం ,వరికుంటపాడు ,తూర్పు బోయమడుగుల సచివాల యాలను డిఎల్‌డిఓ పద్మజా తనిఖీచేసి పలు రికార్డులను పరిశీలించి ,సిబ్బందికి తగిన సలహాలుచేశారు.అనంతరంఎంపిడిఓకార్యాలయంలో పంచాయతీ కార్యదర్శు లు,ఎ ఎన్‌యంలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్‌లో నమోదు చేయడంలో మండలం చాలా వెనుకబాటులో ఉందని,అలాగే రైతు భరోసా టెస్ట్ నమోదు చేయడం ఇంకా ప్రారంభం కాలేదని,అలాగే విద్యార్థులకు అం దించే కుల ధృవీకరణ పత్రాల జారీ సైత ం ప్రారంభం కాలేదు కాబట్టి వెంటనే సంబందిత సచివాలయ అధికారులతో,వాలంటీర్ల ద్వారా పనులు ప్రా రంభించాలన్నారు.అలాగే సచివాలయాల్లో అందించే సేవలను మరింత పెంచాలనీ సూచించారు.కరెంటు బిల్లులను సైతం సచివాలయాల్లోనే కట్టేలా చూడాలన్నారు. ఎంపిడిఓ విజయ్ భాస్క ర్‌రావు,ఈఓఆర్డి సురేష్‌బాబు,ఎంపిడిఓ కార్యాలయ జూనియర్ సహా యకులు రామ కృష్ణారెడ్డి,పంచాయతీ కార్యదర్శులు హరి,శ్రీనివాసులు ,ఖాజామొహిద్దిన్,పుష్పలతా పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగులకు సహకారం అందిస్తాం



**కోవూరు జనవరి 24 ప్రభాతవార్త** ఆం ధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కోవూరు శాఖకు తమ వంతు శాఖాపరమైన సలహాలు సూచనలు సహకారం అందించేందుకు వెల్లవేళలా సిద్ధంగా ఉంటామని కోవూరు సబ్‌డివిజన్ అధికారి పి.కిరణ్‌కుమార్ తెలిపారు. కోవూరులోని బైనాసన్స్ కళ్యాణ మండపంలో మం గళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కోవూరు శాఖ ఆద్వర్యంలో 75 సంవ త్సరాలు పూర్తిఅయిన విశ్రాంత ఉద్యోగులను శాలువా,పూలమాల ,మెమోంటోతో ఘనంగా సన్మానం చేశా రు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు విశ్రాంత ఉద్యోగులకు తమ శాఖ తరపున ఎల్లవేళలా సహకారం అందించేందుకు సిద్దంగా ఉంటామని అన్నారు.ఈ సందర్భంగా 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న 8 మంది విశ్రాంత ఉద్యోగులకు సన్మానం చేశారు.ఈకార్యక్రమంలో సంస్థ అద్యక్షులు ఏ సుబ్బారావు,కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు,ఆర్గనైజింగ్ కార్యదర్శి పరబ్రహ్మం, సభ్యులున్నారు.

## జాతీయ బాలికల దినోత్సవ గోడ పత్రిక ఆవిష్కరణ



**నెల్లూరుటౌన్, జనవరి 24, ప్రభాతవార్త:** జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం జాతీయ బాలికల దినోత్సవ గోడ పత్రికను జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరంలోని ఐసీడీయస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయంలో డైరెక్టర్ కె.సౌజన్య చేతుల మీదుగా గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చైతన్యజ్యోతి వెల్‌ఫేర్ సొసైటీ డైరెక్టర్ ఐ.శ్రీనివాసరావు, జిల్లా ట్రాన్స్‌జెండర్ సీబీవో అధ్యక్షురాలు ఆర్.అలేఖ్య, సఖీ ఒన్‌స్టాప్ సెంటర్ కోఆర్డినేటర్ షేక్ షహనాజ్, సీజేడబ్ల్యూఎస్ స్టాఫ్, ప్రాజెక్ట్ మేనేజర్ కిరణ్, ప్రాజెక్ట్ ఎంఅండ్‌డీ డి.జీవన్, ఏఎన్ఎం అనురాధ, ఐసీడీయస్ సిబ్బంది, చైతన్యజ్యోతి వెల్‌ఫేర్ సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



**చేజర్ల,జనవరి24ప్రభాతవార్త:** మండలంలోని ఆదూరుపల్లి ఉన్నతపాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు చేజర్ల మండల పశువైద్యాధికారి డాక్టర్ రాజేష్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ఆదూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలోని విద్యార్థులకు యానిమల్ వెల్ఫేర్ పోర్ట్‌నైట్ కార్యక్రమంలో భాగంగా జంతువుల సంరక్షణ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించామని ఆయన పేర్కొన్నారు. జంతువుల్లోని రకాలు , వాటివలన మనుషులు పొందే లబ్ధి , సమాజానికి అవి ఏవిధంగా ఉపయోగపడుతున్నాయి అన్న అంశాలపై డివిజన్ స్థాయిలో చేజర్ల మండలం తరపున ఆదూరుపల్లి ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు నిర్వహించామని ఆయన తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను రిపబ్లిక్‌డే సందర్భంగా అందజేస్తామని డాక్టర్ రాజేష్ తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుడిగుంట శేషగిరిరావ్ పర్యవేక్షణలో ఈ పరిక్షలు నిర్వహించామన్నారు.

## గణతంత్ర వేడుకలకు వివేకనంద కళాశాల విద్యార్థిని ఎంపిక



**నెల్లూరు,జనవరి24 ప్రభాతవార్త-విద్య** ఈనెల 26న దేశరాజధాని డిల్లీలో జరుగనున్న గణతంత్ర దినోత్స వేడుకల్లో నిర్వహించే కవాతులో నగరంలోని స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో బికాం చదువుతున్న చావ విమలత ఎంపికైయ్యారని కళాశాల డైరెక్టర్ పి.రాధాకృష్ణ, నావల్ యూనిట్ ఎన్‌సిసి అధికారి రమణలు తెలిపారు. గతంలో కూడా తమ విద్యార్థులు నవ సైనిక్ విభాగంలో కూడా పాల్గొని సత్తా చాటటం జరిగిందన్నారు. ప్రస్తుతం తమ విద్యార్థి గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనటం తమకుఎంపతో సంతోషంగా ఉందన్నారు. వేడుకలు ఎంపికైన విద్యార్థిని ఆ కళాశాల ప్రిన్సిపాల్ వి.ప్రభాకర్, డీన్ పి.శ్రీకర్ రెడ్డిలు, విద్యార్థులు అభినందించారు.

## ప్రజా భద్రతపై పోలీసు ర్యాలీ



**తోటపల్లిగూడూరు, జనవరి 24, ప్రభాతవార్త:** ప్రజా సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా తోటపల్లి గూడూరు పోలీసు ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగం ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కలిగించే క్రమంలో భాగంగా మంగళవారం తోటపల్లి గూడూరు పోలీసు స్టేషన్ నుంచి నరుకూరు వరకు ర్యాలీ నిర్వహించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణం చేయడం ద్వారా తమ తమ ప్రాణాలు కాపాడుకునేందుకు తోడ్పడుతుందని ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

## సౌత్ఆములూరు యుపీ పాఠశాలలో బాలిక దినోత్సవం వేడుకలు



**తోటపల్లిగూడూరు, జనవరి 24, ప్రభాతవార్త:** మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల సౌత్ ఆములూరు నందు మంగళవారం జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రామానుజయ్య బాలికా దినోత్సవం ఉద్దేశం, ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. ఉపాధ్యాయులు షేక్ అహ్మద్‌బాషా మాట్లాడుతూ జాతీయ బాలికా దినోత్సవాన్ని 2008లో మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ ప్రారంభించడం జరిగిందని, బాలికల హక్కులను గుర్తించి వారికి మెరుగైన జీవితాన్ని, మంచి భవిష్యత్తును అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్భయ చట్టం, దిశా చట్టం, బాలల న్యాయ పోషణ సంరక్షణ చట్టం, ఇలా అనేక చట్టాలను బాలికల సంరక్షణకు ప్రవేశపెట్టడం జరిగిందని, పాఠశాల స్థాయిలో బాలికల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం అనేక సదుపాయాలు ఏర్పాటు చేస్తుందని, త ద్వారా బాలికలు అన్ని రంగాల్లో చక్కగా రాణించగలుగుతున్నారని, బాలికలను ఉద్దేశం చి వివరించారు. అనంతరం పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం సందర్భం గా ఏర్పాటు చేసిన వ్యాసరచన, వకృత్వ, క్విజ్ ఎపోటీలలో మహిమారాణి, ఫరీదా, హేమ, లక్ష్మీదీపక్‌లు విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఉపా ధ్యాయులు ఎ.సుభా షిణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో ఘనంగా బాలికల దినోత్సవ వేడుకలు



**నెల్లూరు,జనవరి24 ప్రభాతవార్త-విద్య** బాలికల దినోత్సవాని పురస్కరించుకుని నగరంలోని అనేక పాఠశాలల్లో మంగళవారం అనేకరాజకీయ, స్వచ్ఛంద సేవా సంస్థల ఆద్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లోని బాలికలకు మిఠాయిలు పించిపెట్టి శుభాకాంక్షలు తెలిపారు.

**ఆక్స్ ఫర్డ్ పాఠశాలలో:** నగరంలోని స్థానిక ఆక్స్ ఫర్డ్ పాఠశాలలో బిజేబీ మండలాధ్యక్షులు మారం కృష్ణ ఆద్వర్యంలో మహజళా మెర్చా నాయకురాలు కందిగట్ల రాజేశ్వరయ్య లు బాలికలకు మిఠాయిలను పంచిపెట్టి బాలికల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాలికల దితనోత్సవంపైగ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బిజేపి నాయకులు గంటా విజయశ్రీ, ముక్కు రాధాకృష్ణ, యశ్వంత్ సింగ్, ఎస్.తేజ, పాఠశాల ప్రిన్సిపాల్ మిట్టల్, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ మెడల్ హైస్కూల్‌లో:** బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని బారతీయ జనతా యెవమోర్చా జిల్లా అధ్యక్షులు యశ్వంత్ సింగ్ ఆద్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్య క్రమంలో ముఖ్య అతిధి గా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణ రావు పాల్గొని కేక్‌ను కట్‌చేసి విద్యార్థులకు పంచి పెట్టారు. విద్యార్థుల కు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు శివ, కశ్యప్, మనీ, కృష్ణ, కాజా మస్తాన్

వార్త
రిపోర్టర్స్ కావలెను
తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.
కావలసిన సెంటర్లు
నెల్లూరు నగరంలో... సంతపేట, దర్గామిట్ట, బారకాసు, కలక్టరేట్, నెల్లూరు రూరల్,నెల్లూరు క్రైమ్ విలేకర్లు కావలెను.
మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.
వార్త కార్యాలయం, ఎ.కె.నగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, నెల్లూరు.
ఫోన్: 7675867756, 9347112031